ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల జిల్లా వార్తలు

బుధవారం 5 ఫిబ్రవరి 2025



మహానందిలో..



కర్నూలులో సూర్య భగవానుడికి అలంకరణ



ఘనంగా రథసప్తమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- సంప్రదాయబద్ధంగా సూర్యారాధన

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మాఘ శుద్ధ సప్తమి (రథసప్తమి) పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో మంగళవారం సంప్రదాయబద్ధంగా సూర్యుడిని పూజించారు. దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని అర్చక స్వాములు సంకల్పాన్ని పఠించారు. ఆ తర్వాత కలశ స్థాపన చేసి మహాగణపతి పూజ, బీజమంత్రాలు, ప్రత్యేక ముద్రలతో సూర్యనమస్కారాలు నిర్వహించారు. అదే విధంగా సూర్యయంత్రపూజ, వేద పారాయణాలు, అరుణ పారాయణాలు జరిపించారు. ఈ వేడుకలో శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది క్షేత్రంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మతో పాటు ప్రధాన అర్చకులు అర్జునశర్మ శాస్త్రోక్తంగా రథాంగ పూజలను జరిపారు. అనంతరం పిడకలపై వండిన నైవేద్యాన్ని రథానికి సమర్పించి, కొబ్బరికాయలు కొట్టారు. భక్తి శ్రద్ధలతో అధికారులు, ప్రజలు రథాన్ని ముందుకు లాగారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ మల్టీజోన్-2 రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్, ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో మంగళవారం రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ఆలయంలో 6వ వార్షికోత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతుండగా, మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యభగవానుడికి ఉదయం 10 గంటలకు అరుణ హోమం, సూర్య పంచాతన హోమం చేపట్టి మహా పూర్ణాహుతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, లోక్ అదాలత్ న్యాయాధికారి బి. లీలా వెంకట శేషాద్రి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.



శ్రీశైలంలో సూర్య భగవానుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఈవో



రైతుకు రుణం సులువే..!

- ప్రతి గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు
- కసరత్తు చేస్తున్న నాబార్డు అధికారులు
- అన్నదాతకు తప్పనున్న ప్రైవేట్ అప్పుల బాధ

కర్నూలు మండలంలోని పసుపుల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో నాలుగు వేల మంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఎనిమిది గ్రామాల్లోని ఈ రైతులకు ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుకు రుణాలతోపాటు పొలాలు, ఇతర అభివృద్ధి పనులకు దీర్ఘకాలిక రుణాలను అధికారులు అందజేస్తున్నారు. రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు రుణ బకాయిలు సకాలంలో వసూలు చేయడంలో సహకార సంఘం అధికారులు కుస్తీ పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇదే పరిస్థితిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని నాలుగు లక్షల మంది రైతులకు రుణాలు అందించలేక ఆ సంఘాల్లోని సిబ్బంది నానా అగచాట్లు పడుతున్నారు. ఈ పరిస్థితిని గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం రుణాల మంజూరును సులభతరం చేయడంతోపాటు ఇతర కార్యకలాపాలను ఆ సంఘాలు చేపట్టేలా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

కర్నూలు అగ్రికల్చర్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో అష్టకష్టాలు పడుతున్నారు. అయినా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల నుంచి రైతులను గట్టెక్కించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ వివరాలను నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి బుధవారం వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల పరిధిలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఈ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారానే కేంద్ర సహకార బ్యాంకు రుణాలను రైతులకు అందిస్తోంది. 99 ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా దాదాపు నాలుగు లక్షల మంది రైతులకు రుణాలు అందించే కార్యక్రమాన్ని చేపట్టడం కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితులను నివారించి రైతులకు మరింత చేరువలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను ఏర్పాటు చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు విధి విధానాలు రూపొందించి నివేదికలు పంపాలని నాబార్డు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

మిగతా 6వ పేజీలో



దద్దనాల ప్రాజెక్టుకు నీరు విడుదల

రూ.25 లక్షల వ్యయంతో పొలాలకు నీటి మళ్లింపు

బనగానపల్లె ,ఫిబ్రవరి 4 ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సొంత డబ్బు రూ.25 లక్షలు వెచ్చించి నాలుగు విద్యుత్ మోటార్లను మరమ్మతులు చేయించి దద్దనాల ఎత్తిపోతల పథకం ద్వారా మంత్రి బీసీ ఎస్సార్బీసీ నీటిని జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల చేయించినట్లు ఐడీసీ ఏఈ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. వైసీపీ హయంలో 5 ఏళ్లలో నిరుపయోగంగా ఉన్న ఈ పథకానికి కూటమి అధికారంలోకి రాగానే మోక్షం లభించింది. దద్దనాల ప్రాజెక్టులో రోజు రోజుకూ నీరు తగ్గిపోతుండడంతో రైతుల ఆకాంక్ష మేరకు సొంత నిధులు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెచ్చించి మోటార్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయించి ఎస్సార్బీసీ నీటిని దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల ద్వారా విడుదల చేయించారు. దీని వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతో పాటు నీటి సమస్య తలెత్తకుండా మంత్రి చేశారు. ఈ సందర్భంగా దద్దనాల ప్రాజెక్టుకు గతంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సుమారు 23 కోట్లకుపైగా వెచ్చించి ఎత్తిపోతల పథకం బీసీ జనార్దన్‌రెడ్డి గతంలో పూర్తి చేయించారు. అయితే అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎత్తిపోతల పథకానికి పాతరేసింది. ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందించిన మంత్రి బీసీకి పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, పసుపుల, పాతపాడు, మీరాపురం, యాగంటిపల్లె సాధుకొట్టం తదిత గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎత్తిపోతల ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నీరు చేరడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



దద్దనాల ప్రాజెక్టులోకి ఎత్తిపోతల ద్వారా చేరుతున్న ఎస్సార్బీసీ నీరు

నేడే ఆఖరు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ ప్రకారం నంద్యాల జిల్లాలో 11షాపులను ప్రభుత్వం కేటాయించింది. వీటికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం చివరి తేది అని ఎక్సైజ్ సీఐ తెలిపారు. కొంత మంది హైకోర్టుకు వెళ్లారని, అయితే హైకోర్టు స్టే విధించలేదని, ఈ ప్రక్రియ యధావిధిగా కొనసాగుతుందని సీఐ పేర్కొన్నారు. జిల్లాలో పది శాతం రిజర్వేషన్‌లో భాగంగా 11షాపుల్లో నంద్యాల మున్సిపాల్టీ పరిధిలో ఒక షాపును కల్లుగీత కులస్థులకు కేటాయించిందన్నారు. ఈ షాపులకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 5గంటల వరకు గడువు ఉందని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

నంద్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈసారి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలను నాన్ జంబ్లింగ్ విధానంలో కొనసాగనున్నాయి. ఏ కళాశాల విద్యార్థులు ఆ కళాశాలలోనే ప్రాక్టికల్స్ పరీక్షలను ఏర్పాటు చేసేలా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జంబ్లింగ్ విధానం ఎత్తివేయడంతో విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్స్, అధికారులకు ఊరట కలిగింది. అయితే ప్రతి సెంటరులో 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే సమీపంలోని కళాశాలలోని విద్యార్థులను ఒకే చోట కలిపి ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం నుంచి 20వ తేదీ వరకు సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నారాయణ, చైతన్య కళాశాలల కేంద్రాల్లో మాత్రమే ఏ, బీ సెంటర్లను కొనసాగించారు. జిల్లాలో సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు 5 విడతల్లో జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో కొనసాగుతాయి.



అటవీ భూముల కబ్జా

- నంద్యాల డివిజన్‌లో 500 ఎకరాలు
- అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు
- సర్వేకు సిద్ధమైన అటవీ, రెవిన్యూ అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో చిన్న మొక్క పీకితే పరుగులు పెట్టే అటవీశాఖ అధికారుల కళ్లెదుటే వందల ఎకరాలు కబ్జా అవుతున్నాయి. అటవీ భూముల పరిరక్షణ పర్యావరణ కోణంలో కూడా చాలా కీలకం. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. భూములు కబ్జాకు గురైనా కేవలం నోటీసులకే పరిమితమయ్యారు. భవిష్యత్ తరాలకు అడవులను మిగల్చకుండా భూ ఆక్రమణదారులు అడవులను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. పంటల సాగుపేరిట ప్రకృతి సంపదైన అటవీ భూములను ఇష్టానుసారంగా ఆక్రమించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. నంద్యాల డివిజనల్ అటవీశాఖ పరిధిలోని మహానంది, బండిఆత్మకూరు మండలాల పరిధిలో వందల ఎకరాల భూములను గత ఇరవై యేళ్లుగా ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. సర్వే నంబర్ 604, 642లలో గత 20 యేళ్లుగా అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగుచేస్తున్నారని, అందులో అత్యధికంగా వైసీపి నాయకుల కబంధ హస్తాల్లో ఉన్నట్లు ఇటీవల అటవీశాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో అక్రమార్కులకు కేవలం నోటీసులు మాత్రమే జారీచేసి అధికారులు చేతులు దులుపుకున్నారు.



అన్యాక్రాంతమైన ఫారెస్ట్ భూములు

రెవిన్యూ, అటవీశాఖల మధ్య సమన్వయ లోపం

నంద్యాల డివిజన్‌లో రెవిన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపం కారణంగా అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. రిజర్వ్ ఫారెస్ట్ భూములను సైతం కాజేసి తోటలను పండిస్తున్నారు. నంద్యాల ఫారెస్ట్ డివిజన్ పరిధిలో తెలుగుగంగ ప్రాజెక్టుకు 219 హెక్టార్ల భూమిని కేటాయించారు. తెలుగు గంగ కాల్వ అడవి మధ్యలో నుంచి వెళ్లడం అడవి వైపు కాకుండా మరోవైపు సుమారు 300 ఎకరాల మేర భూమి మిగిలిపోయింది. దీనిపై అటవీ శాఖ అధికారులు దృష్టిసారించకపోవడంతో ఆ భూములన్నీ అన్యాక్రాంతమయ్యాయి.

సర్వే చేయబోతున్నాం

రెవిన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుని రెండు రోజుల్లో సర్వే ప్రారంభించబోతున్నాం. ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటాం. అటవీ భూములను ఎవరైనా కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

-దినేశ్‌కుమార్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్, నంద్యాల

సర్వేకు ఆదేశించిన మంత్రి పవన్‌కళ్యాణ్

అక్రమార్కులకు కేవలం నోటీసులకే పరిమితమైన అధికారులు మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. రెవిన్యూ, పోలీసు శాఖలతో సమన్వయంగా వ్యవహరిస్తూ ఆక్రమణలదారుల భూ ఆక్రమణలు లెక్కలు తేల్చాలని ఆదేశించారు. దీంతో నిద్రావస్థలో ఉన్న అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు మేల్కొని సర్వేకు దాఖలు చేశారు. రెండు రోజుల్లో పూర్తి సర్వేకు పూనుకున్నారు.

చెత్త ఇలా పడేశారేం?

- మహానందిలో దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ ఆగ్రహం
- బ్రహ్మోత్సవ ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఆదేశం



పరిశీలిస్తున్న దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్

మహానంది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పనులు పరిశీలించిన రాష్ట్ర దేవదాయశాఖ మల్టీజోన్-2 రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఆలయ పరిసరాల్లో చెత్తను చూసి ఆగ్రహించారు. రాతి మంటపాల్లో నిరుపయోగమైన వస్తువులను, చెత్తను చూసి అధికారులపై మండిపడ్డారు. మంగళవారం మహానందికి వచ్చిన ఆర్ జెసీ స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం పరిసరాల్లోని రాతి మంటపాల్లో చెత్తను చూసి అసహనానికి గురయ్యారు. రెండో ప్రాకారం బయట ఉన్న విష్ణుగుండాన్ని చూసి ఇంతకూ ఇది మురికి గుంటా? అని ప్రశ్నించారు. కనీసం పేరుకు తగ్గట్టుగా అయినా శుభ్రంగా ఉంచవచ్చు కదా అని అన్నారు. భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు చేసేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. క్షేత్రా నికి ఉన్న పురాతన చరిత్రను దృష్టిలో పెట్టుకొని రాతి స్తంభాలను పురావ స్తుశాఖ అధికారుల సూచనల ప్రకారం శిథిలం కాకుండా కాపాడా లన్నారు. పంచలింగాల మంట పాలను ఎప్పటికప్పుడు శుభ్రం చే యించాలని ఆదేశించారు. అభిషేక మంటపం, అన్నదాన విభాగాల భవనా లను పరిశీలించి, అక్కడి గోడలకు చీలికలు ఎందుకు వచ్చాయని ఇంజనీరింగ్ అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. పనితీరులో మార్పు రాకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రసాదాల విక్రయం కేంద్రం వద్ద క్యూలైన్లను క్రమబద్ధీకరించి భక్తులకు వసతులు కల్పించాలని అన్నారు. ప్రసాదాల పోటును పరిశీలించి లడ్డు నాణ్యత బాగుందన్నారు. అలాగే అన్నదానంలో భక్తుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూసారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, దేవిక, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాచమల్లు శ్రీనివాసులు, చిన్నాలు పాల్గొన్నారు.

ఓ ఊరి కథ

ప్రభుత్వ ఉద్యోగుల ప్యాలకుర్తి



ప్యాలకుర్తి మెయిన్ బజార్



ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఆ గ్రామంలో ఏకంగా 60 మందికిపైనే ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వివిధ శాఖల్లో సర్కారు కొలువులు సాధించి మిగతా ఊళ్లకు ఆదర్శంగా నిలిచారు. గత ఏడాది ఓ యువకుడు ఈ గ్రామం నుంచే ఐపీఎస్‌కు ఎంపికై తమ ఊరి పేరును నలుమూలలా చాటాడు. అలాగే ఎంతోమంది వైద్యులనందించిన ఘనత కూడా ఆ ఊరిదే. ఆ గ్రామమే కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి.

- కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)

- గ్రామంలో 60 మందికిపైనే సర్కారు కొలువులు
- పిల్లలను కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులు
- గత ఏడాది ఐపీఎస్‌కు యువకుడి ఎంపిక

విద్యకు అధిక ప్రాధాన్యత: ప్యాలకుర్తి గ్రామస్థులకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు. ఇక్కడ ప్రజలంతా అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటారు. గ్రామ జనాభా పరంగా చూస్తే ఎస్సీలు 1221, బీసీలు 4935, జనరల్ 2241 మంది ఉన్నారు. వీరిలో అధిక శాతం రైతులు, కూలీలే. ఎల్లెల్సీ కెనాల్, బోర్లు ప్రధాన నీటి వనరు. ప్యాలకుర్తి రైతులు డ్రిప్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు పొందుతున్నారు. మండలంలో మరే గ్రామంలో డ్రిప్ వనరును ఇంతలా వినియోగించలేదంటే అతిశయోక్తి కాదు. ప్యాలకుర్తి రైతులు, కూలీలు చదువుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఉన్నంతలో తమ పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పిస్తారు. విద్యకు పెట్టే ఖర్చులో వెనుకంజ వేయరు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగానే పలువురు ఉద్యోగాలు సాధించారు.



ఉన్నత స్థానంలో: కర్నూలు జీజీహెచ్‌లో కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్యాలకుర్తి వాసియే. ఆయన తండ్రి లక్ష్మణదాసు రిటైర్డ్ టీచర్. లక్ష్మణదాసుకు నలుగురు సంతానం. వారందరూ వివిధ రంగాల్లో ఉన్నారు. అలాగే నిరుడు ఐపీఎస్ సాధించిన షేక్ హబీబుల్లా తండ్రి, తాత ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. ఈయన తండ్రి అబ్దుల్ ఖాదర్‌బాషా తెలంగాణలో ట్రాన్స్‌కో డీఈఈగా పని చేస్తున్నారు. తాత మహబూబ్ దౌలా రిటైర్డ్ టీచర్. గ్రామం నుంచి 14 మంది ఉపాధ్యాయులు, 13 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు ఎస్ఐలు, పది మంది డాక్టర్లు, ఒక తహసీల్దార్, ముగ్గురు వీఆర్వోలు, ఒక పంచాయితీరాజ్ ఇంజనీర్, బ్యాంకు ఉద్యోగులు ఐదుగురు, ఐదుగురు సచివాలయం, ఒక జిల్లా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఒక ఆప్కో, ఏడుగురు ఆర్టీసీ, నలుగు ట్రాన్స్‌కో వంటి ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్నారు.

చదువుతోనే పురోగతి

యువత కష్టపడి చదవాలి. మేము ఎంచుకున్న మార్గమే వారికీ లక్ష్యం కావాలి. సాధించగలననే ఆత్మవిశ్వాసం ఉంటే ఎవరికైనా విజయం దాసోహమవుతుంది. నిరంతర శ్రమ, కఠోర దీక్ష లక్ష్య సాధనకు ఆయుధాలు. చదువు అందరి సొత్తు. తల్లిదండ్రులు చదువే ఆస్తిగా చూపడంతో బాగా కష్టపడ్డాను. వైద్యరంగంలో కార్డియాలజీ చీఫ్, సూపరింటెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ హోదాల్లో రిటైర్డ్ అయి ప్రస్తుతం జీజీహెచ్ సీనియర్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. ఇంతటి పేరు, ప్రతిష్ఠలు రావడానికి చదువు గొప్పతనమేనని ఘంటాపథంగా చెబుతాను.

-డాక్టర్ చంద్రశేఖర్,
జీజీహెచ్ కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్



ఫెయిల్యూర్‌ను షూట్ చేయాలి

చదువు ఎన్నటికీ వృథా కాదు. లక్ష్యం ఏర్పరచుకుని ముందుకు సాగడం ఎంతో అవసరం. పోటీ పరీక్షల్లో ఫెయిల్యూర్ అయినంత మాత్రాన కుంగిపోవద్దు. తప్పిదాలను గుర్తించి సరిదిద్దుకోవడమే అతిపెద్ద విజయం. నేను ఇదే అనుసరించి 2023లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. ఇటీవలే ఐపీఎస్ శిక్షణ కూడా పూర్తయింది. అనేక నేరాంశాల్లో లోతైన విషయాలు తెలుసుకున్నాం. ఫెయిల్యూర్స్‌ను షూట్ చేస్తే విజయం తప్పకుండా సొంతమవుతుంది.

- ఐపీఎస్ సాధించిన షేక్ హబీబుల్లా

పిల్లలు కష్టపడి చదువుకున్నారు



మాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. నేను వ్యవసాయం చేస్తాను. నా భార్య కేశమ్మ కూరగాయలు విక్రయిస్తుంది. మాకు ఏడుగురు సంతానం. పెద్ద కుటుంబమైనా చదువు విలువ గుర్తు చేస్తూ పిల్లల్ని పెంచాను. మొదటి కుమారుడు సుధాకర్‌యాదవ్ ఎస్ఐ ఉద్యోగం సాధించి అనంతపురంలో పని చేస్తున్నాడు. రెండో అబ్బాయి మెడికల్ రెప్, మూడో వాడు పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. అమ్మాయిల్లో ఒకరు బ్యాంకు, మరొకరు సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నారు.

- గైరబోని హనుమంతు,
రైతు, ప్యాలకుర్తి

రేపటి నుండి బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 17వ తేదీ వరకు బీఈడీ 1,2,3,4 స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో 277 మంది విద్యార్థులు పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు.

● **రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు:** డిగ్రీ 1,2,3,4,5,6 సెమిస్టర్ల స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 6 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 11 కేంద్రాల్లో 2,481 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

9 న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో 10వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చిత్తలూరి రామ్‌ప్రసాద్, చింతలపల్లి కోటేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత యంఆర్ గోవిందరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత ఆర్‌సీ కంబగిరి రాజు అవార్డు పేరుతో ఈనెల 9 వతేదీన 10వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 2గ్రాముల బంగారు పతకం, 20గ్రాముల వెండి పతకం, 10గ్రాముల వెండి పతకం, ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు చింతలపల్లి కోటేష్ సెల్‌నెంబర్ 9966639299, సీతారం ఆర్ట్స్ -9866760490 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రైతుకు రుణం సులువే..!



(5వ పేజీ తరువాయి)

ఇప్పటిదాకా ఒక ప్రాథమిక వ్యవసాయ సంఘం పరిధిలో 5 నుంచి 10 వేల మంది రైతులు ఉన్నారు. వీరందరికీ సంఘంలోని సీఈవోలు, వారి సిబ్బంది రుణాలు మంజూరు చేయాలన్నా, బకాయిలు సత్వరమే వసూలు చేయాలన్నా కష్ట సాధ్యమైపోతోంది. ఇకపై ఈ పరిస్థితులకు చెక్ పెట్టి రైతులకు చేరువలోనే సంఘాల ఏర్పాటు జరగాలని కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 900కుపైగానే పంచాయతీలు ఉన్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మల్టీ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటు కాబోతోంది. దీని వల్ల రైతులకు అత్యంత చేరువలోనే సంఘం ఉండటం వల్ల రుణాల మంజూరు, బకాయిల చెల్లింపు వేగవంతమవుతుందని నాబార్డు అధికారులు చెబుతున్నారు. కంప్యూటీకరణ ప్రస్తుతం దాదాపు పూర్తయ్యే దశలో ఉంది. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే గ్రామ పంచాయతీల్లో మల్టీ వ్యవసాయ పరపతి సంఘం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.

రుణాల మంజూరు ఇక సులభతరం



ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రుణాల మంజూరుతోపాటు బకాయిలు వసూలు చేసే విషయంలో ఆ సంఘాల సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతులకు కూడా రుణాలు సకాలంలో అందడం లేదు. సహకార సంఘాల్లో రుణాలు ఇవ్వడమే కాకుండా వారిని మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామానికి ఒక మల్టీ వ్యవసాయ పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం సంఘాల ఏర్పాటు సంబంధించి కంప్యూటరీకరణ దాదాపు పూర్తి కావచ్చింది. త్వరలోనే కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తును ప్రారంభించబోతున్నాం.

- నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

సముద్ర శాస్త్రవేత్త ఎంపీఎం రెడ్డి కన్నుమూత

- అంతర్జాతీయ ఖ్యాతి గడించిన జిల్లావాసి
- సముద్రశాస్త్రంలాగే సాహిత్యమూ ఆయనకు ఇష్టం



డాక్టర్ ఎంపీఎం రెడ్డి (ఫైల్)

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ సముద్రశాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి (90) మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి జిల్లాలోని కోవెలకుంట్ల సమీపంలోని సుద్దమళ్ల గ్రామ వాస్తవ్యులైన డాక్టర్ ఎం. మద్దులేటి రెడ్డి (ఎంపీఎం రెడ్డి) ఆంధ్రా యూనివర్శిటీ నుంచి సముద్రశాస్త్రంలో తొలి డాక్టరేట్ పట్టా పొందారు. కెనడా ప్రభుత్వం ఈయనను పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్‌నకు ఎంపిక చేసింది. కెనడాలో ఉంటూ అక్కడి సముద్రతీరంలో అనేక పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించి ఆ ప్రభుత్వం ప్రశంసలు పొందారు. అనంతరం గోవాలో సెంటిఫిక్ పూల్ అధికారిగా పనిచేస్తూ అరేబియా సముద్రంపై పరిశోధనలు చేశారు. మంగుళూరు కాలేజ్ ఆఫ్ ఫిషరీస్‌లో సుదీర్ఘకాల హెచ్ఓడీగా పనిచేశారు. దేశవ్యాప్తంగా వందలాది సముద్రశాస్త్ర విద్యార్థులకు మార్గదర్శిగా ఉండి వారి పరిశోధనలకు దోహదం చేశారు.

ఏడు సముద్రాలు చుట్టువచ్చిన శాస్త్రవేత్త: కెనడా ప్రభుత్వ ఆధ్వర్యంలో డాక్టర్ రెడ్డి ప్రపంచంలోని ఏడు సముద్రాలు చుట్టివచ్చారు. నెదర్లాండ్‌లోని బాల్కెమా పబ్లిషర్లు డాక్టర్ రెడ్డి రాసిన 'డిస్క్రిప్టివ్ ఫిజికల్ ఓషనాగ్రఫీ'ని ప్రచురించారు. యూఎస్ఏలోని సైన్స్ పబ్లిషర్లు 'ఓషన్ ఎన్విరాన్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్' అనే పుస్తకాన్ని ముద్రించారు. ప్రస్తుతం కేంబ్రిడ్జ్, జపాన్, జర్మనీలలోని యూనివర్శిటీలు డాక్టర్ రెడ్డి రచించిన ఓషనోగ్రఫీ గ్రంథాలు సముద్రశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ప్రచురించాయి. లండన్ లైబ్రరీలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖుల పేర్లు ప్రచురించిన 'హూ ఈజ్ హూ' అనే పుస్తకంలో ఇండియా నుంచి పేర్కొనదగిన ప్రముఖుల్లో ఈయన ఒకరిగా పేర్కొన్నారు. సముద్రశాస్త్రం, సాహిత్యంపై 27 పుస్తకాలు రాశారు. తెలుగు కళా సమితి స్థాపించి అప్పటి గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య, నాటి రాష్ట్ర విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావుతో సాహితీ సభలు జరిపారు. విశ్రాంత జీవితంలో కర్నూలుకు వచ్చి తెలుగు కళా స్రవంతి స్థాపించి పలువురు రచయితలను, కవులను ప్రోత్సహించారు. తన స్వగ్రామం సుద్దమళ్ల గురించి 'మావూరి ముచ్చట్లు' పేరుతో పుస్తకం వేశారు.

ప్రముఖుల నివాళి: ఉమ్మడి జిల్లాకు గర్వకారణమైన శాస్త్రవేత్తగా డాక్టర్ రెడ్డి నిలిచిపోతారని, బనగానపల్లె అరుణభారతి సంస్థ వ్యవస్థాపకుడు బీసీ రాజారెడ్డి కొనియాడారు. డాక్టర్ రెడ్డి మృతి కళా సాహిత్య రంగాలకు తీరని లోటని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర శ్లాఘించారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన మహనీయుడుగా డాక్టర్ ఎంపీఎం రెడ్డి నిలిచిపోతారని తెలుగు కళా స్రవంతి కార్యదర్శి ఇనాయతుల్లా నివాళులు అర్పించారు. డాక్టర్ రెడ్డి రాసిన గ్రంథాలను ప్రపంచంలోని అన్ని యూనివర్శిటీల విద్యార్థులు పాఠాలుగా చదువుకుంటున్నారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శ్లాఘించారు.

బాలోత్సవాలకు వేళాయే..!

- 6, 7 తేదీల్లో ఇండస్ పాఠశాలలో నిర్వహణ
- హాజరు కానున్న 2వేల మంది విద్యార్థులు



మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మకత నైపుణ్యాలు వెలికితీసి సహజ మేధస్సును సమాజ నిర్మాణానికి అందించే లక్ష్యంతో బాలోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య తెలిపారు. మంగళవారం స్థానిక రవీంద్ర పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పిల్లల సందడి ఈ ఏడాది మొదలైందని తెలిపారు. కర్నూలులోని ఇండస్ పాఠశాలలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ బాలోత్సవ వేడుకలకు ఇండస్ పాఠశాల వేదికగా మూడు ప్రధాన వేదికల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 2వేల మంది విద్యార్థులు వంద పాఠశాలల నుంచి పాల్గొంటున్నారని తెలిపారు. బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసే క్రమంలో ఈ బాలోత్సవాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణ లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్ కెంగార మోహన్ మాట్లాడుతూ సృజనాత్మకత నైపుణ్యం, సహజ మేధస్సు నైతికతను పెంపొందించి విద్యార్థులకు ఉన్న నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నమే బాలోత్సవాల నిర్వహణ అన్నారు. అసమానతలు లేని సమాజం, శాస్త్రీయమైన సమాజ నిర్మాణంలో విద్యార్థులను భాగస్వాములుగా చేయడమే లక్ష్యమన్నారు. ఇందులో అకడమిక్ కల్చరల్ ఈవెంట్లను నిర్వహిస్తున్నామనీ, వ్యాసరచన, వక్తృత్వపోటీలు, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, దేశభక్తి గీతాలాపన వంటి 35 రకాల ఈవెంట్లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య, బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి జేఎన్ శేషయ్య, అకడమిక్ విభాగం కమిటి సభ్యులు కన్వీనర్ యుఆర్ఏ రవికుమార్, డి.ధనుంజయ, జంద్యాల రఘుబాబు, రంగస్వామి, రమాదేవి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వర స్వామికి పూజలు



శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలోని నందీశ్వర స్వామికి, సుబ్రమణ్య స్వామి (కుమారస్వామి), బయలు వీరభద్రస్వామివారికి పూజలు చేపట్టారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై మంగళవారం మహానందికి చెందిన రామన్నగౌడ్ వారి బృందం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

దేవర పొట్టేలు రూ.1.10లక్షలు

మంత్రాలయం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో జరిగే దేవర మహోత్సవానికి సర్పంచ్ శంకరమ్మ భర్త లక్ష్మయ్య రూ.1.10లక్షలు పెట్టి పొట్టేలును కొనుగోలు చేశారు. బుధవారం జరిగే దేవమ్మ, మారెమ్మ అమ్మవార్ల దేవర కోసం కర్ణాటకలోని బ్యాడిగ నుంచి పొట్టేలును కొనుగోలు చేశాడు. దాదాపు 90 నుంచి 100 కేజీలు కలిగి ఉండే భారీ కొమ్ములు కలిగిన పొట్టేలు రూపాన్ని చూసి గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఒక్కొక్క ఇంటికి రెండు పొట్టేళ్ల ప్రకారం కొనుగోలు చేసినప్పటికీ దాదాపు అధిక ధరను వెచ్చించి కొనుగోలు చేసిన పొట్టేలును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



దేవరకు పొట్టేలును రూ.1.10 లక్షలుపెట్టి కొనుగోలు చేసిన సర్పంచ్ భర్త లక్ష్మయ్య

విరసం 24వ సాహిత్య పాఠశాల

8, 9న కర్నూలులో

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో 24వ సాహిత్య పాఠశాలను 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహిస్తున్నారు. ఈనెల 8, 9 తేదీలలో నగరంలో గుత్తి పెట్రోల్ బంక్ పక్కనగల వెంకటేశ్వర కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసినట్లు విరసం నేత నాగేశ్వరాచారి తెలిపారు. ఇటీవల మరణించిన కవి, విప్లవ మేధావి, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా స్మృతిపథంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. 8న ఉదయం 10.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 11 గంటలకు అరుణ్ ఆహ్వానం, అరసవిల్లి కృష్ణ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంతకుమారి ప్రారంభోపన్యాసం చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శివరాత్రి సుధాకర్ అధ్యక్షత 'మేధో సృజనరంగాలపై ఫాసిస్టుల దాడి - కార్పొరేట్ ప్రయోజనాలు' అనే అంశంపై అల్లం రాజయ్య ప్రసంగిస్తారు. 3.30 గంటలకు 'సంక్షోభాన్ని ఎదుర్కొవడంలో రచయితల దృక్పథాలు, వైఖరులు' అనే అంశంపై ఉజ్వల్, సీఎస్ఆర్ ప్రసాద్ నిర్వహణలో కెంగార మోహన్ (సాహితీ స్రవంతి), రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి (అరసం), యాకూబ్, షైక్‌బాబ, మెర్సీ మార్గెరెట్, సుభాషిణీ, గుడిపాటి నిరంజన్, మహమూద్, వేంపల్లి షరీఫ్, ఏకే ప్రభాకర్, వైష్ణవి శ్రీ పాల్గొంటారు. సాయంత్రం సూర్యచంద్ర, ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో కవి గాయక సభ ఉంటుంది. 9న ఉదయం 10 గంటలకు పుస్తక ఆవిష్కరణ, 11.30 గంటలకు వరలక్ష్మి అధ్యక్షతన 'తెలుగు సాహిత్యంలో వెలుగు నీడలు' అనే అంశంపై అరసవిల్లి కృష్ణ ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సాగర్ అధ్యక్షతన 'విప్లవోద్యమంపై ఫాసిస్టు యుద్ధం - రచయితలు, బుద్ధిజీవుల పాత్ర' అనే అంశంపై పాణి ప్రసంగిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ఊరేగింపు, 5.30 గంటలకు జరిగే బహిరంగ సభకు కె. నాగేశ్వరాచారి అధ్యక్షత వహిస్తారు. వక్తలుగా జి. కళ్యాణరావు, శశికళ, ప్రొఫెసర్ హరగోపాల్, బొజ్జా దశరథరామిరెడ్డి ప్రసంగిస్తారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జెసీ, తదితర జిల్లా అధికారులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కాలనీలో నూతనంగా ఎంపికైన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సందర్శించి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులు, అణగారిన వర్గాల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, డీఆర్వో రామునాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు బాలనాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్‌బాబు, రమేష్‌నాయక్, వెంకటేష్ నాయక్, నాగనవీన్, మురళి, సంబంధిత అధికారులు తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను తెప్పించుకోవాలని సాంఘిక సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామన్నారు. సఫాయి కర్మచారులకు జీతభత్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

'ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి'

నంద్యాల ఎడ్యుకేషన్: ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో రైతుల అవగాహన కోసం ఐదు మోడల్ ప్రాజెక్టులను ఎంపిక చేయాలని, ఇందులో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, హాస్టల్, రెండు మహిళా స్వయంసహాయక సంఘాలు సభ్యులుగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ అధికారి నాగరాజు, డీఆర్‌డీఏ పీడీ డైరక్టర్ శ్రీధర్‌రెడ్డి, డీపీఎం నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకి జేఏసీ చైర్మన్‌గా భవానీ ప్రసాద్



డైరీని ఆవిష్కరిస్తున్న డా. భవానీ ప్రసాద్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాల్మీకి సంఘాల జేఏసీ చైర్మన్‌గా డా. భవానీ ప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం వాల్మీకి బోయ సేవా సంస్థ డైరీ-2025ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయల ఎస్టీ పునరుద్ధరణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలుస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ మహేష్ నాయుడు, బీవీఎస్ఎన్ వ్యవస్థాపకుడు, అధ్యక్ష కార్యదర్శులు కుబేరస్వామి, పెద్దయ్య, మల్లికార్జున, న్యాయవాదులు భాస్కర్, బేతం కృష్ణుడు, విష్ణు, కృష్ణమూర్తి, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి



బషీర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా

పెద్దకడుబూరు, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీకాం చదువుతున్న పంజారి బషీర్ పారా అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో పింజారి బషీర్ పాల్గొన్నారని తెలిపారు. 100మీటర్లు, 1500 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 17,18,19 వ తేదీల్లో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి బషీర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్‌బాషా, సూపరింటెండెంట్ మద్దిలేటి, శీను, బాబు, పీడీ సుధాకర్ అభినందించారు.

జిల్లా పరిషత్‌లో పదోన్నతులు



సిబ్బందితో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ముగ్గురు టైపిస్టులు, ఎనిమిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతులమీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో పని చేస్తున్న ముగ్గురు టైపిస్టులు శ్రీధర్‌కు ఆదోని పీఐయూ సబ్‌డివిజన్, ఎం.శ్యామలకు గోనెగండ్ల ఎంపీడీవో, బి.జ్యోతిప్రభకు, పీఐయూ డివిజన్ కర్నూలు, జూనియర్ అసిస్టెంట్లు వై.రవికాంత్‌రెడ్డికి తుగ్గలి ఎంపీడీవో, డి.భారతికి పీఆర్ఐ నంద్యాల డివిజన్, పి.కిరణ్‌ప్రసాద్ శర్మకు పీఐయూ కర్నూలు డివిజన్, బి.నాగరాజ కుమారికి పీఆర్ఐ ఆదోని డివిజన్ కార్యాలయానికి కేటాయించారు.

థియేటర్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

నందికొట్కూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ థియేటర్‌కు సంబంధించిన గోదాములో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంగళవారం పట్టణంలోని గోదాములో షార్ట్ సర్క్యూట్ జరగడంతో గోదాములో నిల్వ ఉన్న 900 కుర్చీలు కాలిపోయాయని యజమాని రామిరెడ్డి తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి నష్టం విలువను అంచనా వేస్తున్నారు. గోదామును సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు పరిశీలించారు.



కాలిపోయిన కుర్చీలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఒకరికి తీవ్ర గాయాలు

గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆగి ఉన్న లారీని బైకు ఢీకొనడంతో సురేష్(20) మృతి చెందగా, తిప్పక్క తీవ్రంగా గాయపడ్డారు. కె.నాగలాపురం ఎస్ఐ ఆశాలత తెలిపిన మేరకు వివరాలివీ.. దేవనకొండ మండలం కోటకొండ గ్రామానికి చెందిన సురేష్‌తో పాటు తిప్పక్క కె.నాగలాపురంలో అమ్మవారి దేవరకు వచ్చి తిరుగు పయనమయ్యారు. అయితే పెంచికలపాడు సమీపంలో కోడుమూరు వైపు రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి బైక్ ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న సురేష్ మృతి చెందాడు. తిప్పక్కకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైకులు ఢీ.. వ్యక్తి మృతి

కౌతాళం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద-కౌతాళం గ్రామాల మధ్య మంగళవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. వివరాలు.. ఉరుకుంద గ్రామానికి చెందిన పూజారి వీరేష్(45) కూతురు జయశ్రీని కస్తూర్బా పాఠశాలలో వదిలేందుకు మంగళవారం బైకుపై వచ్చాడు. కుమారుడు రమేష్‌తో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా బదినేహాల్‌కు చెందిన మంగళి రవి మరో బైక్‌పై అతివేగంతో వచ్చి ఢీ కొట్టంతో పూజారి వీరేష్ అక్కడిక్కక్కడే మృతి చెందాడు. కొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. కాగా మరో ద్విచక్రవాహనదారుడు మంగళి రవి స్వల్పంగా గాయపడ్డాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, కొడుకు ఉన్నారు. కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన పూజారి వీరేష్ (ఫైల్)



గాయపడ్డ మంగళి రవి

ట్రేడ్ లైసెన్సు చెల్లించం

- మద్యం వ్యాపారుల విముఖత
- నోటీసులు జారీ చేస్తున్న నగర పాలక అధికారులు





చెల్లింపులపై వ్యాపారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆదాయానికి ట్రేడ్ లైసెన్సు ఒక మార్గం. అయితే ఏ వ్యాపారం చేసినా నగర పాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం ఫీజు చెల్లించాలి. ఈ క్రమంలో నగర పాలక పరిధిలో 52 వార్డులు ఉండగా ఇందులో 27 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మద్యం దుకాణం సంవత్సరానికి రూ.10 వేల ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించాలి. దీని వల్ల నగర పాలక సంస్థకు సంవత్సరానికి రూ .2.70,000 ఆదాయం వస్తుంది. లైసెన్సు తీసుకొని ఫీజు చెల్లించాలని నగర పాలక అధికారులు దుకాణ యజమానులకు అడుగుతున్నారు. అయితే తాము ఒక్క పైసా కూడ చెల్లించబోమని, ఎక్సైజ్ అధికారులు చెల్లించకూడదని చెప్పారని వ్యాపారులు అంటున్నారు. ముఖ్యంగా లైసెన్సు ఫీజు

ఐదేళ్లపాటు ప్రభుత్వ దుకాణాల తీరు అంతే..

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాటు ఒక్క దుకాణం కూడ ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించలేదు. దీని వల్ల నగర పాలక సంస్థ సుమారు రూ.13,50,000 నష్టపోయింది. నగరంలో ఉండే బార్ అండ్ రెస్టారెంట్లు మాత్రం సంవత్సరానికి రూ.25 వేల చొప్పున ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లిస్తున్నారు. మరి అలాంటప్పుడు మద్యం వ్యాపారులు ఎందుకు చెల్లించడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణ యజమానులు ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లిస్తుండేవారని అధికారులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి దాకా దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోవడం లేదు.

ప్రజాప్రతినిధుల వద్దకు పంచాయితీ..

ట్రేడ్ లైసెన్సు ఫీజుల విషయం స్థానిక ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లింది. అయితే మద్యం దుకాణాలలో చాలా వరకు స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉంది. అందువల్లే ఎవ్వరూ లైసెన్సు తీసుకోవడం లేదు. దీని వల్ల నగర పాలక ఆదాయానికి గండి పడుతుందని తెలిసినా కూడ ప్రజాప్రతినిధులు వ్యాపారులను వెనుకేసుకుని రావడం బాగాలేదని కొందరు గుసగుసలాడుతున్నారు. కొందరు యజమానులు ఏకంగా మంత్రితోనే చెప్పిస్తామని, తాము ఫీజు కట్టాల్సిన పని లేదని తేల్చిచెబుతున్నారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితిలో ఉన్నారు.

త్వరలో నోటీసులు ఇస్తాం

నగర పాలక పరిధిలోని మద్యం దుకాణాలకు ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని చెబుతూనే ఉన్నాం. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. త్వరలోనే దుకాణాలకు నోటీసులు జారీ చేస్తాం.

-డాక్టర్ కే. విశ్వేశ్వరరెడ్డి, ప్రజారోగ్య అధికారి

మా పరిధిలో లేదు

ట్రేడ్ లైసెన్సు విషయం మా పరిధిలో లేదు. మేము ఎన్నడూ మద్యం దుకాణ యజమానులకు ట్రేడ్ లైసెన్సు చెల్లించవద్దని చెప్పలేదు. నగర పాలక అధికారులు నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సు వసూలు చేసుకోవచ్చు. ఇతర శాఖలకు సంబంధించిన చెల్లింపులు ఉంటే మేము వద్దని చెప్పం.

- చంద్రహాస్, పట్టణ ఎక్సైజ్ సీఐ

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

ఆత్మకూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద సోమవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీ సులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు అర్బన్ సీఐ రాము మంగళవారం మాట్లాడుతూ.. ఆత్మకూరుకు చెందిన నగేష్, ఓర్వకల్లుకు చెందిన చాంద్‌బాషా ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో ఇళ్ల వద్ద జనం నుంచి సేకరించిన సుమారు 2వేల కేజీలు (40ప్యాకెట్లు) రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా నంద్యాల టర్నింగ్ వద్ద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ రేషన్ బియ్యాన్ని కర్నూలుకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీటిని వివిధ హోటళ్లకు దోసెలు, ఇతర ఆహార పదార్థాల తయారీకీ వినియోగించేందుకు తీసుకెళ్తున్నట్లు నిందితులు చెప్పారని తెలిపారు. ఈ మేరకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ట్రాలీ వాహనంతో పాటు 40 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడిం చారు. కేసు నమోదు చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

ఆత్మకూరు పట్టణంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు అర్బన్ సీఐ రాము తెలిపారు. ఈ సందర్భంగా వారికి జరిమానాలు విధించినట్లు చెప్పారు. కాగా సొంత అవసరాలకు మాత్రమే ఇసుక తెచ్చుకోవాలని, తప్ప అనుమతులు లేకుండా విక్రయించకూడదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిందితుడి అరెస్టు

- తుగ్గలి ఎస్ఐ క్రిష్ణమూర్తికి ఎస్పీ అభినందనలు



నిందితుడితో పోలీసులు

తుగ్గలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్య మహబూనిని కత్తితో పొడిచి హత్య చేసిన భర్త అక్బర్ వలిని అరెస్టు చేసిన తుగ్గలి ఎస్ఐ క్రిష్ణమూర్తిని ఎస్పీ అభినందించినట్లు పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో సోమవారం మండల పరిధిలోని రాతన కొత్తూరులో భార్యను హత్య చేసిన నిందితుడు అక్బర్ వలిని అరెస్టు చేసి సోమవారం డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ పులిశేఖర్‌గౌడు, ఎస్ఐ క్రిష్ణమూర్తి కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు వెలడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్రామయ్య మాట్లాడుతూ హత్య జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని ఎంతో చాకచక్యంగా పోలీసులు అరెస్టు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. నిందితుడు పరారవుతూ హత్యకు గురైన భార్య మహబూని ఫోన్‌ను తీసుకెళ్లడంతో ట్రాక్ చేసి తుగ్గలి పాత రైల్వేస్టేషన్ వద్దపోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసు కున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్ తుగ్గలి సీఐ పులిశేఖర్‌గౌడు, ఎస్ఐ క్రిష్ణమూర్తిలను అభినందించారన్నారు.

గ్రామ యువకుడే దొంగ

- పోలీసుల అదుపులో నిందితుడు
- రచ్చుమర్రి చోరీ కేసులో రికవరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ, క్లూస్ టీమ్

మంత్రాలయం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో జరిగిన భారీ చోరీ కేసులో దొంగ ఆ గ్రామానికి చెందిన యువకుడే అని పోలీసులు తేల్చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని చాకచక్యంగా విచారించి డబ్బులు, బంగారు రికవరీ చేశారు. గత నెల 25వ తేదీన చోరీ జరిగినట్లు బాధితుడు శేషాద్రి శెట్టి ఫిర్యాదు చేయడంతో మాధవరం ఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. క్లూజ్ టీం ద్వారా వేలిముద్రల సేకరణ, డాగ్ స్క్వాడ్‌తో కొంత ప్రాథమిక సమాచారం లభించింది.

ఈ మేరకు కేసును ఛేదించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ విజయ కుమార్ చాకచక్యంగా నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా.. దొంగతనం తానొక్కడే చేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం. ఆదోని, ఎమ్మిగనూరులో బంగారు గొలుసులు అమ్మినట్లు చెప్పడంతో పోలీసులు రికవరీ చేసినట్లు తెలిసింది. నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. చోరీకి పాల్పడిన వ్యక్తి 18 ఏళ్ల యువకుడని, గతంలో రెండు, మూడు పర్యాయాలు చోరీలకు పాల్పడినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి, తాగుడుకు బానిసై దొంగతనాలు చేస్తున్నట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు.

నందమూరి నగర్‌లో చోరీ

- మూడిళ్లలో విలువైన వస్తువులు, నగదు అపహరణ





చిందరవందరగా ఉన్న వస్తువులను చూపుతున్న బాధితురాలు... దొంగలు పగులగొట్టిన బీరువా వద్ద బాధితురాలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నందమూరినగర్‌లోని గొల్లపేట ప్రాంతంలో వరుసగా దొంగలు మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ప్రజలు గాఢ నిద్రలో ఉండగా దొంగలు ఇళ్ల తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడి చోరీకి తెగబడ్డారు. నంద్యాల పప్పులబట్టి బజారులోని శారద విద్యాపీఠం స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న వెంకటలక్ష్మి ఇంట్లోకి చొరబడి వెండి పూజా సామగ్రి దోచుకెళ్లారు. వీటి విలువ రూ.30వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. జహనాబీ అనే మహిళ ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాలో ఉంచిన రెండు తులాల బంగారు గొలుసు, వెండికాళ్ల పట్టీలతో పాటు రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. షేక్ రుక్సానా అనే మహిళ ఇంట్లో బీరువాను పగులగొట్టి అందులోని బంగారు ఉంగరం, వెండికాళ్ల పట్టీలు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. నంద్యాల తాలుకా పోలీసులు వరుస దొంగతనాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వైభవంగా రథసప్తమి



కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత, వెంకటరెడ్డి



నంద్యాలలో హోమంలో పాల్గొన్న భక్తులు



ఆత్మకూరులో రథోత్సవం



నందికొట్కూరులో దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



ఎమ్మెల్యే జయసూర్యకు జ్ఞాపికను అందిస్తున్న కమిటీ సభ్యులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ప్రాంగణంలో మంగళవారం వైభవంగా రథసప్తమి వేడుక లు నిర్వహించారు. ఉదయం గణపతిపూజతో ప్రారంభించి అష్టదళపాద పద్మారాధన సేవ, సూర్య ఆరాధనలు, సూర్య నమస్కారాలు, కార్యసిద్ధి గణపతి హోమం, దశభుజ గణపతి హోమం, ధన్వంతరీ హోమం, సుదర్శన హోమం, అరుణహోమం,ఇత్యాది హోమాల అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, శ్రీనివాస్, పార్థసారధికృష్ణ, వంకదారి మధుసూదన్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భద్రావతీ భావనా ఋషి ఆలయంలో రథసప్తమీ సందర్భంగా భద్రావతి, భావనా ఋషి స్వామి వారి కళ్యాణం నిర్వహించారు.

నంద్యాల ఎడ్యుకేషన్: సూర్యుని నుంచి వెలువడే కిరణాలు సకల చరాచర జగత్తుకు శక్తిని ప్రసాదిస్తుందని శ్రీరామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి వివరించారు. రథసప్తమి సందర్భంగా నంద్యాల శ్రీ శాంతినికేతన్ పాఠశాలలో నిర్వాహకుడు సుధాకర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు.

ఆత్మకూరు: సూర్యభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆత్మకూరులోని భూరాహ శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో రథోత్సం అత్యంత వైభవోపేతంగా కొనసాగింది. ముందుగా ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ఆరాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్న సమయంలో రథంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో పాటు సూర్యభగవానుడి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి అశ్వరథ కార్యక్రమాన్ని జరిపారు. సూర్య భగవానుడికి విశ్వక్షేణారాధన, పుణ్యాహవచనం, ద్వాదశ ఆరాధన, మహాసౌరమంత్రపఠనం, సూర్యాష్టం వంటి తదితర పూజా కార్యక్ర మాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవరపల్లి అనిల్‌కుమార్ రథసప్తమి విశిష్టత గురించి వివరించారు. రథోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రామయ్య తదితరులు ఉన్నారు.

పాణ్యం: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులు హాజరయ్యారు. స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. శివాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఈవో రామకృష్ణ, సిబ్బంది ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ భాస్కరరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రమణమూర్తి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు మిలిటరీ సుబ్బారెడ్డి, రామ్మోహన్‌నాయుడు, నంద్యాల రవి, సురేష్, శివశంకరరెడ్డి, దానం, అర్చకులు వీరయ్య స్వామి, నారాయణస్వామి, సురేష్‌శర్మ, రోహిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరులోని ఛాయా ఉషా సమేత శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం తెల్లవారు ఝామునుంచే భక్తులు ఆ సూర్య భగవానున్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు రవి, బాలయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఛాయా ఉషా సమేత సూర్యనారాయణస్వామి వారి కల్యాణం కన్నుల విందుగా జరిగింది. ఎమ్మెల్యే వెంట టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ముర్తుజావలి, లాయర్ జాకీర్, వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

'దరఖాస్తు చేసుకోండి'

మిడుతూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 18ఏళ్ల నుంచి 55 సంవత్సరాలలోపు వారు శ్రమ్ బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దశరథరామయ్య సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ వృత్తుల కింద పని చేస్తున్న వారు నమోదు చేసుకోవాలన్నారు. మరణించిన వారికి రూ.2 లక్షలు, శాశ్వతంగా అంగవైకల్యం జరిగిన వారికి రూ.లక్ష ప్రభుత్వం నుంచి వస్తాయని ఆయన తెలిపారు. రైతులు, శ్రామికులు, ఉపాధి కూలీలు, అన్నివర్గాల వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పగిడ్యాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పగిడ్యాలకు చెందిన పరమేష్ నాయుడు(22) చికిత్స పొందుతూ మృతి చెందారు. ముచ్చుమర్రి ఏఎస్‌ఐ శేషయ్య తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన పెద్ద మద్దిలేటి కుమారుడు పరమేష్‌నాయుడు ఐటీఐ వరకు చదువుకొని ఇంటి వద్ద ఉంటూ తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయంగా ఉండేవాడు. అయితే గత నెల 27వ తేదిన రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మరుసటి వైద్య చికిత్సల కోసం కర్నూలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అయితే కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. ప్రేమ విఫలమే కారణమని యువకుడి తండ్రి ఫిర్యాదు చేశారు. మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

18 మందికి ఉద్యోగాలు

నందికొట్కూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సునీత తెలిపారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 43 మంది హాజరు కాగా అందులో 18 మంది ఉద్యోగ అర్హత సాధించినట్లు ఆమె తెలిపారు. ఏపీఎస్‌ఎస్డీసీ సీడప్ ఎంప్లాయిమెంట్, కాలేజి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయండి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని థెరిసా జూనియర్ కళాశాలలోఈ 7వ తేదిన టెన్త్ విద్యార్థులకు నిర్వహించనున్న ట్యాలెంట్ టెస్టును విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దినేష్‌కుమార్, సాయి, ప్రశాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో పది విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం మాడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 6303261839 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

'సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి'

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బీసీ, కమ్మ, కాపు వైశ్య ఈడబ్ల్యూఎస్ కు చెందిన ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవాని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సబ్సిడీ రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్, కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్, మహిళా అధ్యక్షురాలు విజయగౌరి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు: ఏపీజీబీ ఆర్ఎం



రైతుకు పంటకోత మిషన్‌ను అప్పగిస్తున్న బ్యాంకు సిబ్బంది

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రంలో భాగంగా గృహ, వాహన, వ్యక్తిగత, విద్య, ఆస్తి తనఖా రుణాలపై అతి తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ రమణ తెలిపారు. నంద్యాల ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఆర్ఎం ఆధ్వర్యంలో రుణ విస్తరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు రూ.7.20కోట్ల విలువ గల రుణాలును మంజూరు చేశారు. ఆర్ఎం మాట్లాడుతూ ఈనెల 15 వతేదీ వరకు రిటైల్ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపుతో పాటు వడ్డీ రాయితీ ఉందని, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు రుణం ద్వాం పంటకోత మిషన్‌ను బ్యాంకు సిబ్బంది రైతుకు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ రవికుమార్, సీనియర్ మేనేజర్ స్ఫూర్తికిరణ్, సరళ రుణ కేంద్ర చీఫ్ మేనేజర్ రమేష్‌బాబు, మోహనరామకృష్ణ, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థుల పరారీ

● గాజులపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టుకున్న ఉపాధ్యాయులు

మహానంది, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పరీక్షలు దగ్గర పడటంతో ఒత్తిడికి గురైన మహానంది ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన 8 మంది పదో తరగతి విద్యార్థులు మంగళవారం వసతి గృహం నుంచి పరారయ్యారు. తరగతి గదిలో విద్యార్థులు కనిపించక పోవడంతో ఉపాధ్యాయిలు మిగతా విద్యార్థులను విచారించినట్లు తెలిసింది. వార్డెన్‌కు జరిగిన విషయాన్ని తెలిపారు. ఉపాధ్యాయిలు పారిపోయిన విద్యార్థులను పట్టుకొనేందుకు మహానంది పరిసరాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని గాజులపల్లి రైల్వేస్టేషన్‌లో పారిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులను గుర్తించారు. వెంటనే వారిని పట్టుకొని తిరిగి ఆశ్రమ పాఠశాలకు చేర్చారు. హాస్టల్ వార్డెన్ అంబమ్మను వివరణ కోరగా వసతి గృహానికి చెందిన 8 మంది విద్యార్థులు పారిపోవడం నిజమేనని చెప్పారు. తిరిగి ఉపాధ్యాయిలు తీసుకొచ్చారని చెప్పారు. పది పరీక్షలు దగ్గర పడటంతో మానసిక ఒత్తిడి వల్లే ఇలా విద్యార్థులు పారిపోవడానికి సిద్ధపడ్డారని తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి గ్రామ శివార్లలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ మంగళవారం తెలిపారు. ఓ సారా స్థావరాన్ని గుర్తించి 1500 లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై లు వీరస్వామి, జగదీష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అక్రమ కట్టడాలను తొలగించాలి'

పాములపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాములపాడులోని బస్టాండ్ ప్రాంతంలో ఆర్అండ్‌బి, పంచాయ రహదారుల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం పాములపాడు బస్టాండ్ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా కొలతలు వేసి అక్రమ దుకాణాలను తొలగించే చర్యలు చేపట్టాను ఈ మేరకు ఆయా దుకాణ దారులకు ఇదివరకే నోటీసులు జారి చేసినట్లు తెలిపారు. ఈవోఆర్డీ రంగనాయక్, పంచాయతీ కార్యదర్శి నాగశేషులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డాకు జ్ఞాపికను అందజేస్తున్న సభ్యులు



నంద్యాలలో ఫిరోజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో జనవరి 7,8,9 తేదీల్లో నిర్వహించిన ఉమూమి తబ్లిగీ ఇజితెమా కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో కమిటీ పెద్దలు మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని ఘనంగా సత్కరించారు. వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామంలో గల ఎమ్మెల్యే బుడ్డా స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇజ్‌తెమా కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చొరవతో రూ.2కోట్ల నిధులను సమకూర్చడంతో పాటు ఆయా ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి సహకరించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరగడం పట్ల ఇజ్‌తెమా కమిటీని, ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే బుడ్డా అభినందించారు.

నంద్యాల మున్సిపాలిటీ: టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌ను ఇస్తెమా కమిటీ బుధవారం నంద్యాలలో సన్మానించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇటీవల ఆత్మకూరులో ఇజితెమా జరిగిందని, ఫరూక్, ఫిరోజ్ లు సహకరించటంతో ఎస్తెమా విజయవంతమైందని అన్నారు. ఫిరోజ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా మతపరమైన కార్యక్రమాలకు తమవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఇజితెమా కమిటీ సభ్యులు, మతపెద్దలు, ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలం'



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారని ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్యల గురించి వివరించారు. అన్నింటిపై మంత్రి సానుకూలంగా వ్యవహరించారని రవీంద్ర తెలిపారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

పాములపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాయపాటి మురళీ మోహన్ సూచించారు. నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి పర్యటించి బీజేపీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మద్దూరు గ్రామ బీజెపి నాయకులు హేమచంద్ర,ఆవులయ్యలు ఉన్నారు.

రైతులకు అవగాహన

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రామకృష్ణారావు, నీలిమ, చైతన్య అవాహన కల్పించారు. మంగళవారం వారు ఏడీఏ ఆంజనేయ, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి మండలంలోని కరివేన, కురుకుంద, ఆత్మకూరు అర్బన్, కృష్ణాపురం గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతు సేవా సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

కొత్తపల్లి: రైతాంగం ఎప్పుడూ ఒకే పంటలు కాకుండా అప్పుడప్పుడు పంట మార్పిడి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించివచ్చని జిల్లా కేంద్ర వ్యవసాయాధికారి హేమలత సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దగుమ్మడాపురం, శివపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి మహేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గుమ్మడాపురం సర్పంచ్ నక్కవిజయకుమార్, ఉప సర్పంచ్ బొల్లు శ్రీనివాసులు, రెవెన్యూ అధికారి సుందర్‌రావు, సిబ్బంది శివమ్మ బాయి, మౌనిక రైతులు పాల్గొన్నారు.

'రాయితీ కల్పించాలి'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అరవై సంవత్సరాలు దాటిన వయోవృద్ధులకు రైల్వే టికెట్లపై 50 శాతం రాయితీ కల్పించి, ప్రత్యేక బోగి వసతి కల్పించాలని సిపిఎం నాయకుడిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి స్టేషన్ మాస్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం కార్య దర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రమేష్‌కుమార్

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నంద్యాల జిల్లా సీపీఎం కార్యదర్శి రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈనెల 1,2,3 తేదిలలో నెల్లూరులో 27వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈసభలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా రమేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఇటీవల నందికొట్కూర్‌లో జరిగిన మహాసభలో తిరిగి జిల్లా కార్యదర్శిగా ఎన్నికై తర్వాత మూడోసారి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యథాస్థానంలోకి దాత చిత్రపటం

మహానంది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ అభివృద్ధికి పూర్వం తన కున్న ఆస్తిని మెత్తం ఇచ్చిన దాత దివంగత భైరవజోస్యుల మహానందయ్య చిత్రపటాన్ని ఆలయ సిబ్బంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్నారు. అయితే మంగళవారం దేవదాయశాఖ రీజనల్ జాయింట్, కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఉన్న మహానందయ్య చిత్రపటాన్ని చూసి మనిషి చిత్రపటం ఇక్కడ ఏర్పాటు చేయడం ఏమిటని ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది ఆయన చిత్రపటాన్ని తప్పని సరి పరిస్థితుల్లో తొలగించారు. దీనిపై మహానంది స్థానిక ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. దీంతో చిత్రపటాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేశారు.

పెచ్చెరువు గూడెంలో అధికారుల పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నల్లమలలోని పెచ్చెరువు గూడేన్ని అధికారులు మంగళవారం సందర్శించారు. డీఎల్‌డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఈవోఆర్డీ బాలునాయక్ అధికార యంత్రాంగంతో కలిసి పెచ్చెరువు గూడెంలో గ్రామ సభను ఏర్పాటు చేసి అక్కడి సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను సంద ర్శించి అక్కడ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. శ్రీశైల పాద యాత్రికులకు ఏలోటు రానివ్వకుండా చూస్తామని డీఎల్‌డీవో తెలిపారు. లక్షలాదిగా తరలి వచ్చే పాదయాత్రికులకు మౌళిక సదుపా యాలను కల్పించేందుకు గూడెంలో అధికారులతో కలిసి పర్యటించి తాగునీటి సదుపాయాలను పర్యవేక్షించారు. భక్తులకు తాగునీటి ఇబ్బం దులు తలెత్తకుండా ముందస్తుగా అక్కడి బోర్లకు మరమ్మతులు చేయిం చారు. ఏవో ఉమ్మర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎల్ఐసీని బలోపేతం చేయాలి'



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఆత్మకూరు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మనోజ్, జాయింట్ సెక్రటరీ నాగన్న అన్నారు. మంగళవారం ఆత్మకూరులోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లతో కలిసి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 74 శాతం నుంచి వంద శాతానికి ఎఫ్డీఐని పెంచడం తగదని, ఇది బీమా రంగానికి నష్టదాయకమని అన్నారు. ఉద్యోగులు, ఆత్మకూరు, నందికొట్కూరు ఏజంట్లు పాల్గొన్నారు.

హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా హెల్మెట్ ప్రాధాన్యం పోలీస్ అధికారులు మంగళవారం వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాహనాల తనిఖీ చేపట్టి హెల్మెట్ వాడకంపై చైతన్యం చేశారు. రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై కూడా దృష్టి సారించారు. ఈ సందర్భంగా డ్రైంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఓవర్‌లోడింగ్, త్రిబుల్ రైడింగ్, డ్రంకెన్‌డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర ఉల్లంఘటనలపై చర్యలు చేపట్టారు.

'కేన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి'



మిడుతూరు కేజీబీవీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు



నంద్యాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్డీపీవో జావలి ఆల్ఫోన్స్

మిడుతూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌తో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నోడల్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి సూచించారు. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా మంగళవారం తలముడిపి గ్రామ పీహెచ్‌సీలో, మిడుతూరు కేజీబీవీలో వైద్యాధికారులు ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యాధికారులు తిరుపతి, మద్దిలేటి, శారద, సాయిసుధ, సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది ముర్తుజావలి, సూర్యం, చంద్రకళ, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాణ్యం: కల్తీ ఆహారమే కేన్సర్‌కు కారణమని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ చెట్టి అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో కేన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఫార్మా-డి విద్యార్థులు కేన్సర్ రకాల గురించి వివరించారు. అనంతరం కేన్సర్ లోగోను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల హాస్పిటల్: అత్యాధునిక వైద్యంతో కేన్సర్‌ను జయించవచ్చని నంద్యాల ఎస్డీపీవో జావలి ఆల్ఫోన్స్ అన్నారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల ఐఎంఎ, ఉదయానంద హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఎస్డీపీవో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నేటి ఆధునిక వైద్యం ద్వారా నయం చేయవచ్చన్నారు. డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ భార్గవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా నంద్యాల ఎల్‌కేఆర్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని డోన్ సీడీపీవో శంషాద్‌బేగం అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బేటి బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో శంషాద్‌బేగం మాట్లాడుతూ అవగాహన లోపంతో బాల్య వివాహాలను ప్రోత్సహించి ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచించారు. కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంభూపాల్, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రశేఖర్, పద్మావతి బాల్య వివాహాల వల్ల తల్లికి శిశువుకు కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిన్న ప్రైవేటు స్కూల్స్ యజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డోన్ పట్టణం స్పార్క్ ప్రైవేటు పాఠశాలకు చెందిన యూపీఎస్ఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ జే.చంద్రశేఖర్ కోరారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

అసంఘటిత కార్మికులకు ఆర్థిక భద్రత భరోసా

చాగలమర్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంఘటిత రంగంలోని కార్మికులకు ప్రభుత్వ ఆర్థిక భద్రత భరోసా కల్పించేందుకు ఈ ఏడాది ఈ-శ్రమ పోర్టల్‌ను ప్రారంభించిందని జిల్లా లేబర్ ఆఫీసర్ మురళీ తెలిపారు. మంగళవారం చాగలమర్రి వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలు, అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ పోర్టల్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగమ్మ, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

తొలిదశలోనే గుర్తిస్తే నియంత్రణ సాధ్యం

శిరివెళ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే నియంత్రణ సాధ్యమవుతుందని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శిరివెళ్ల పీహెచ్‌సీ నుంచి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్లలో అనేక రకాలున్నాయని.. వాటిపై ప్రజలకు అవగాహన పెంపొందించి క్యాన్సర్ రహిత భవిష్యత్తు అనే ఉమ్మడి లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ సుభాషిని, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీ నిధులు మంజూరు చేయండి

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సీడ్స్ కార్పొరేషన్‌కు సబ్సిడీ నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి సీఎంను ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో మొదటి నుంచి సేవలందిస్తూ కష్టపడి పని చేసిన నాయకులను గుర్తించి నామినేటెడ్ పదవుల పోస్టులలో వారికి న్యాయం చేయాలని సీఎంను ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయంలో తెలుగు యువత అధికార ప్రతినిధి మందా విజయ్, తాడిపత్రి షబానా ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, గూడూరు నాగేశ్వరరెడ్డి, ఉలువల నరసింహుడు, మాజీ సర్పంచ్ సీతారామయ్య , వైద్య సిబ్బంది, బ్రీడ్స్ రవి, చంద్రమోహన్‌యాదవ్, బుగ్గ రాముడు, బొట్టుస్వామి పాల్గొన్నారు.

'చలో హైదరాబాదును జయప్రదం చేయండి'

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎమ్మార్పీస్ తలపెట్టిన చలో హైదరాబాదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మారెన్న, పక్కీరా, నాగన్న కోరారు. కొలిమిగుండ్లలోని దండోరా కమ్యూనిటీ హాల్ వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, బాల ఓబులేషు, సురేష్, రామచంద్రుడు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి విరాళం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ బొమ్మిడాల డిగ్రీ కళాశాల అభివృద్ధికి దాతలు విరాళం అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలు సన్నిధి చంద్రశేఖర్, మల్కిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డిని సన్మానించారు.

వెల్ బేబీ పోటీల్లో చిన్నారికి అవార్డు



అవార్డు అందుకున్న చిన్నారి తల్లిదండ్రులు

నంద్యాల, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో 8వ ఆల్ ఇండియా ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ నిర్వహించిన వెల్ బేబీ పోటీలలో నంద్యాల జిల్లా బనగానపల్లికి చెందిన డాక్టర్ సయ్యద్ జావిద్ అష్రాఫ్, డాక్టర్ షాహీరా దంపతుల కుమారుడు సయ్యద్ జైన్ అష్రాఫ్ గెలుపొందారు. ఈ పోటీలలో ఎత్తు, బరువు, పరిశుభ్రత, వస్త్రధారణ అనే అంశాల పరంగా అవార్డుకు ఎంపిక చేశారు. దీంతో తమ కుమారుడికి మూడు నెలల వయస్సులోనే అవార్డుతో పాటు ప్రశంసా పత్రం వచ్చిందని తల్లిదండ్రులు సంతోషించారు. బంధువులు కూడా జైన్‌కు అభినందనలు తెలియజేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరిపై భానుడి కిరణాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అద్భుతం ఆవిష్కృతమైంది. రథసప్తమి పర్వదినం సందర్భంగా గర్భగుడిలోని వాసవీమాతపై ఉదయం ఆదిత్యుడి కిరణాలు ప్రసరించడంతో భక్తులు పులకించారు. పట్టణ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఏటా రథసప్తమి రోజు ఇలా భానుడి కిరణాలు అమ్మవారిని స్పృశిస్తాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీశ్‌బాబు, కమిటీ సభ్యులు వెల్లడించారు.



ఆళ్లగడ్డలో వాసవీమాతపై ప్రసరిస్తున్న ఆదిత్యుడి కిరణాలు

9నుంచి షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో నిర్మించిన షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఈ నెల 9నుంచి నిర్వహించనున్నట్లు షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ ఉపాధ్యక్షుడు చాటకొండ శ్రీనివాసు తెలిపారు. మంగళవారం సాయంత్రం షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చాటకొండ శ్రీనివాసులు మాట్లాడుతూ 9, 10, 11, 12 తేదీల్లో సాయిబాబా మందిరంలో విశేష పూజలు జరుగుతాయన్నారు. 13న సాయిబాబా విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు కందుకూరు పార్థసారధి, ఆలా మల్లికార్జున రెడ్డి, కొండా సురేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'పల్లె వెలుగు' ఏవి?

- గ్రామాల్లో కనిపించని ఆర్టీసీ బస్సులు
- పట్టణాలకే పరిమితం
- మారుమూల పల్లెలకు ఆటోలే శరణ్యం

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వివిధ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెవెలుగు బస్సులు పల్లెలకు కాకుండా పట్టణాలకే పరిమితమవుతున్నాయి. దీంతో పల్లె ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి రవాణ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. డోన్ ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్డినరి (పల్లె వెలుగు) బస్సులు 32 ఉన్నా యి. వీటిలో అధిక భాగం డోన్ నుంచి కర్నూ లుకు 13, బేతంచెర్లకు 8, కోడుమూరు రూట్‌కు రెండు బస్సులు నడుపుతున్నారు. మరో ఏడు బస్సులు విద్యార్థులకు కేటాయించారు. ప్రధాన రహదారి వైపు ఉన్న పల్లెలకు మాత్రమే ఆర్డినరి బస్సులు వెళ్తున్నాయి. దొరపల్లి, లక్ష్మీపల్లె, మల్లెం పల్లె, ధర్మవరం, కనప కుంట, పెద్దమల్కాపురం తదిత ర గ్రామాలు బస్సులు వెళ్లడం లేదు. దాంతో రాకపోక లను సాగించ డాని కి ఇబ్బంది పడుతు న్నారు. కొన్ని రూట్లలో విద్యార్థి బస్సులే శరణ్యమవుతున్నాయి. దాంతో ఆయా రూట్లలో ప్రైవేటు ఆటోల జోరు బాగా పెరిగింది. మండలంలోని అనధికారిక లెక్కల ప్రకారం 300 పైగా ఆటోలు పల్లెల నుంచి డోన్‌కు నిత్యం తిరుగుతున్నాయి. తమ గ్రామాలకు ఆర్టీసీ వారు బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్న పాల కులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ వారు స్పందించి గ్రామాల్లో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

> **కలెక్షన్లు ఉంటే.. నడుపుతాం**
>
> వివిధ గ్రామాలకు వెళ్లే రూట్లలో కలెక్షన్లు లేకపోవడంతో ఆర్డినరి బస్సులు ఏర్పాటు చేయలేకపోతున్నాం. కలెక్షన్లు వచ్చే రూట్లలో తప్పక బస్సులు నడుపుతాం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో తిరుగాలి.
>
> **- శశిభూషణ్, ఆర్టీసీ డిపో మేనేజర్, డోన్**



డోన్ ఆర్టీసీ డిపోలోని బస్సులు



కోట్లవారిపల్లె సర్కిల్‌లో కెపాసిటీకి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

> **అవగాహన పెంచాలి**
>
> ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ప్రయాణిం చేలా అవగాహన పెంచాలి. బస్సులలో ప్ర యాణాలు సురక్షితమని తెలియజేయాలి. అప్పుడే ఆర్టీసీ బస్సులకు ఆదాయం సమకూరుతుంది.
>
> **- గార్లపాటి మద్దిలేటి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయ కర్త, డోన్**

> **బస్సు ప్రయాణమే సురక్షితం**
>
> బస్సు ప్రయాణమే సురక్షితం. ప్రతి నెలా ఆర్టీసీ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తూ ఆటోలను తనిఖీ చేస్తూ కెపాసిటి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలపై కేసులు రాస్తున్నాం. నెలకు 20 నుంచి 25కేసులు నమోదు అవుతున్నాయి.
>
> **- క్రాంతి కుమార్, ఆర్టీవో డోన్**

మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

మార్క్‌ఫెడ్ డీఎం హరినాథ్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన దిగుబడులకు కనీస మద్దతుధర కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని మార్క్‌ఫెడ్ డీఎం హరినాథ్‌రెడ్డి, నాఫెడ్ రాష్ట్ర ఇన్‌చార్జి శర్మ అన్నారు. ఆళ్లగడ్డలోని మార్కెట్‌యార్డులో నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని వారు మంగళవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో 2,400 మంది రైతులు దాదాపు 6 వేల ఎకరాల్లో కంది పంటను సాగు చేశారన్నారు. క్వింటా కందులకు కనీస మద్దతు ధర రూ.7,550 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం కనీస మద్దతు ధరను అందిస్తోందన్నారు. ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మైలేరి మల్లయ్య, వ్యవసాయ శాఖ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ నారాయణ స్వామి, సూపర్‌వైజర్ సురేష్, డీసీఎంఎస్ నాగ ప్రవీణ్, రవి, మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

వైభవంగా రథసప్తమి

చాగలమర్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయం, చెన్నకేశవ ఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలను నరసింహస్వామి మాలదారులు, శివస్వాములు, మహిళలు వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద సూర్య భగవానుడికి ఎదురుగా నమస్కారాలు చేస్తూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పాత శివాలయంలో మహిళలు వివిధ రకాల పండ్లు, పూలతో ధ్వజస్తంభం వద్ద సూర్యుడిని దైవంగా పూజించారు. అనంతరం శివస్వాములు, నర సింహస్వామి మాలదారులు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయా ల కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానికి సరస్వతి శిశుమందిరంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటి సభ్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

అవుకు : అవుకు మండలం శివవరం గ్రామంలో వెలసిన అత్యంత పురాతనమైన సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా మంగళవారం నిర్వహించారు. అర్చకులు రమణాచార్యులు ఉదయం స్వాముల వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : ఆళ్లగడ్డ పట్టణంలో పద్మశాలీయుల ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భద్రావతి భవనారాయణ స్వామి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. యర్రం రాంగోపాల్, మాధవీలత దంపతులు, గంజి హరిప్రసాద్, మాధవి దంపతులు స్వామిఅమ్మవార్లకు ఉభయదారులుగా వ్యవహరించి కల్యాణం జరిపించారు. భక్తులు కల్యాణ వేడుకలను తిలకరించి విశేష పూజలు నిర్వహించారు.



పాత శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



శివవరంలో సూర్యనారాయణ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



ఆళ్లగడ్డలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోడలిపై మామ కత్తితో దాడి

దొర్నిపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దొర్నిపాడు గ్రామంలో కోడలిపై మామ కత్తితో దాడి చేసిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సంతకు వెళ్లి కూరగాయలు తీసుకొస్తున్న కోడలిపై అప్పటికే కత్తితో మాటు వేసి ఉన్న మామ వెనుక నుంచి వచ్చి వీపుపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె రక్తగాయాలు కావడంతో స్థానికులు ఆమెను ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు దొర్నిపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈబీసీ కులాల వారు కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి నాలుగు యూనిట్లు మంజూరు అయ్యాయన్నారు. 50 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వ్యవసాయ అధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రాజేంద్ర కుమార్ కోవెలకుంట్ల ఏడీఏ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. అనంతరం ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

వ్యక్తికి జైలు, జరిమానా

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన గగ్గెర వెంకటనాగేష్‌కు ఆరు నెలల జైలు, ఐదు వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2018లో అతడిపై 452, 324 ఐపీసీ కింద కేసు నమోదు అయిందన్నారు. కోవెలకుంట్ల సివిల్ కోర్టులో అతడు చేసిన నేరం రుజువు కావటంతో న్యాయాధికారి మంగళవారం పై విధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు నష్టపరిహారం అందజేత

రుద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజి పరిధిలోని వన్నెప్రాణుల వలన నష్టపోయిన రైతులకు మంగళవారం రేంజర్ శ్రీపతినాయుడు నష్టపరిహారం చెక్కులు అందజేశారు. రుద్రవరం, పందిళ్లపల్లి, పెద్దకంబలూరు, కొండమాయపల్లె, గ్రామాలకు చెందిన 18 మంది రైతులకు రూ.లక్ష నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. వన్నె ప్రాణులకు హాని తలపెట్టవద్దు, పంటలకు నష్టం కలిగితే పరిహారం అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, మక్బూల్ బాష, మహబూబ్‌ఖాన్, రాణెమ్మ, రామకృష్ణ, పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాట్లకు భూముల పరిశీలన

బేతంచెర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములను రెవెన్యూ, విద్యుత్ అధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఎం.పెండేకల్, గూటుపల్లె, కొలుముల పల్లె ముద్దవరం గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఉన్న పొలాలను సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తహసీల్దార్ ప్రకాష్‌బాబు, విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి, సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విరాళంగా పంచలోహ నాగాభరణం

బేతంచెర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరిపేటలోని పూదోట మఠంలో వెలసిన బేతేశ్వర స్వామి శివలింగానికి 15కేజీల పంచలోహ నాగభరణాన్ని భక్తులు విరాళంగా అందజేశారు. మంగళవారం మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్, కిరణ్ పూదోట మఠంలోని శివలింగానికి పంచలోహ నాగభరణాన్ని ఆలయ నిర్వాహకులు ప్రసాద్, గుండా గోపాల్‌లకు అందజేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



శివలింగానికి ఏర్పాటు చేసిన పంచలోహ నాగభరణం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చిన్నారుల సంరక్షణే లక్ష్యం

- సుశీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్



చాగలమర్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. రక్తహీనత కలిగిన మహిళలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి?

జవాబు: మండలంలో 53 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న: అంగన్‌వాడీలలో ఎంత మంది చిన్నారులు, గర్భిణులు ఉన్నారు?

జవాబు: 0-6 నెలలుగల పిల్లలు 515, మూడు సంవత్సరాల లోపు 2,800, 3-6 సంవత్సరాల లోపు 1,300 మంది పిల్లలు, గర్భిణులు 518, బాలింతలు 508 మంది ఉన్నారు.

ప్రశ్న: అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: మండలంలో 12 సొంత భవనాలు, 35 అద్దె భవనాలు ఉన్నాయి. శెట్టివీడు, జ్ఞానాపురం గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి.

ప్రశ్న: బాలామృతం సక్రమంగా అందిస్తున్నారా?

జవాబు: మండలంలోని 53 కేంద్రాలకు 2,800 బాలామృతం ప్యాకెట్లు ప్రతి నెల మంజూరవుతాయి. వాటిని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నాం. పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందా?

జవాబు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల పోస్టుల కొరత ఉంది. డి.వనిపెంట, చిన్నబోదనం గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మారెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరపల్లె గ్రామంలో మారెమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

డోన్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొన్నడంతో మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లె, శెట్టివీడు గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంఈవో-1 అనూరాధ, ఎంఈవో-2 న్యామతుల్లాలు తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యగల భోజనం, కోడిగుడ్లు ఇవ్వాలని సూచించారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. హెచ్ఎంలు సుబ్రహ్మణ్యం, లక్ష్మీకుమారి, సీఆర్పీ అమీర్‌ఖాన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సస్యరక్షణలతోనే అధిక దిగుబడి

చాగలమర్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం పెద్దబోదనం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కంది విక్రయించే రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజినవేముల గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో నిరంజన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ సూచించారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 10న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్‌బెండజోల్ గులికలను మింగించాలని అన్నారు. పుట్టుకతో వచ్చే వ్యాధులు, రక్తహీనతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సీతారాములు, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ పనుల్లో నాణ్య తాప్రమాణాలు పాటించాలని ఈవోఆర్డీ ప్రకాశ్ నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని సంతపేటలో చేపట్టిన డ్రైనేజీ పనులను ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతపేటలో చాలా మంది డ్రైనేజీలను ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించడంతో సమస్యగా ఉండేదన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 15లక్షలు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు పూర్తి అయితే ప్రజలకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు

నేటి నుంచి కందుల కొనుగోలు

బనగానపల్లె ,ఫిబ్రవరి 4 ఆంధ్రజ్యోతి): మండలంలో మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరతో బుధవారం నుంచి కందులు కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, డీసీఎంఎస్ మేనేజరు శంకర్ మంగళవారం తెలిపారు. కందులను కనీస ప్రభుత్వ మద్దతు ధర రూ.7550లకు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు కందులను అమ్ముకోవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్దిలేటి రెడ్డి మృతి బాధాకరం

- మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె ,ఫిబ్రవరి 4 ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ మండలం సుద్దమల్ల గ్రామానికి చెందిన ప్రముఖ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీ మద్దిలేటిరెడ్డి (90)మృతి బాధాకరమని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. మంగళవారం బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ మద్దిలేటి రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారన్నారు. తెలుగు కళాస్రవంతిని స్థాపించి అసాధారణ సేవలు అందించారన్నారు. డాక్టర్ ఎం.పీ మద్దిలేటిరెడ్డి రచించిన సముద్రశాస్త్రం పుస్తకాలు నేడు ప్రపంచంలోని అన్ని యూనివర్సిటీల్లో పాఠాలుగా బోధిస్తున్నారన్నారు. వారి కుటుంబ సభ్యులకు రాజారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.